145

# సుశీల ; శారద

శ్రీమతి శారద తెలుగు చలనచిత్ర నటీమణి. తమమధ్యవున్న ప్రతిభావంతులను గుర్తించి గౌరవించే గుణం తెలుగువారికి తక్కువయినందున శారద ఇతర భాషాచిత్రాలలో ముఖ్యంగా మళయాళ చిత్రాలలో నటించడం ప్రారభించింది. ఒకానొక మళయాళ చిత్రంలోని ఆమె అపూర్వ నటనా కౌశలానికి మెచ్చి భారత ప్రభుత్వంవారు శ్రీమతి శారదను 1969 సంవత్సరంలో భారతదేశంలోకెల్లా అత్యుత్తమనటిగా ఎన్నుకుని ఆమెకు ''ఊర్వశి'' పతకాన్ని బహూకరించారు. దక్షిణాదిని ఈ పురస్కారం పొందిన మొట్టమొదటి నటి శారద. దేశంలో ఈగౌరవాన్ని పొందిన రెండవ నటీమణి శారద. ఆమె గత వారం ఈ పురస్కారాన్ని ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ఒక ఉత్సవంలో రాష్ట్రపతి నుండి స్వీకరించింది.

ఉత్సవంలోనే ఆదేశంలోకెల్లా అత్యుత్తమగాయనిగా బహుమతిని స్వీకరించిన శ్రీమతి పి. సుశీల మరొక ప్రతిభావంతురాలయిన తెలుగు మహిళ. అయితే ఆమెకు ఈసారి ఈ జాతీయ గౌరవాన్ని సంపాదించి పెట్టినది ఒక తమిళ చిత్రంలో ఆమె పాడిన పాట.

ఈరెండుదాహరణాలనూ పరిశీలిస్తే కొన్ని ప్రశ్నలుదయిస్తాయి.

అటు తమిళ, కన్నడ, మళయాళ చలన చిత్రాలకూ, ఇటు హిందీ చలనచిత్రాలకూ తెలుగువారు నటీనటులను. దర్శకులను, సాంకేతిక నిపుణులను, గాయనీ గాయకులనూ అందజేశారన్నది మనకు తెలుసును గాని

దేశానికి అంతగా తెలియని విషయం. ఇట్లా ఒక భాషవారు మరొకభాష వారితో కలసి పనిచేసి వారినుండి ఆదర గౌరవాలు పొందడం భావసమైక్యతకు తోడ్పడుతుంది. నిజమే కాని శారద వంటి నటీమణికి 'ఊర్వశి' బహుమతి లభించగలటువంటి అవకాశం తెలుగు చలనచిత్రాలలో ఎందుకు లభించ లేదు? తెలుగువారామెకు ఆ అవకాశాన్ని ఇవ్వలేదా? లేక తెలుగు చలన చిత్రాల స్థాయి అంత అధ్వాన్నంగా అఘోరిస్తున్నదా ? (ప్రాంతీయ చలన చిత్రాంలో బహుమతిపొంది ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో ప్రదర్శింపబడిన తెలుగు చిత్రం చూస్తూంటే-మనవాళ్ళింకా 18వ శతాబ్దంలోనే వున్నారనిపించింది.) శ్రీమతి సుశీల ఎన్నో తెలుగు సినిమాలలో కొన్నివందల తెలుగుపాటలు పాడింది. కాని ఆమెకు దేశంకెల్లా ఉత్తమ గాయనిగా గౌరవం ఒక తమిళ పాటద్వారా లభించింది. అంటే ఏమిటి ? తెలుగు చలన చిత్రాలలో సంగీతపు నిర్వాకం అట్లా వుందనా ?

లేకపోతే—

జాతీయ స్థాయి బహుమతుల కోసం అర్హులను ఎన్నుకునేటువంటి నిర్ణాయక సంఘాలలో తెలుగువారికి సరిగా ప్రాతినిధ్యంలేక, వాటిలో శర గోపన్‌లు, మీనన్లు. దాస్‌గుప్తాలు కూర్చుని తెలుగు వారికి అన్యాయం చేస్తున్నారనుకోవాలా ? కాకపోతే మరి అయా తెలుగు కళాకారుల ప్రతిభ ఇతరభాషలద్వారానే గుర్తించబడనేల ?

ఇది తెలుగువారు ఆలోచించవలసిన విషయం.

ఈ సారి దేశంలోకెల్లా అత్యుత్తమనటి, దేశంలోకెల్లా అత్యుత్తమ గాయని- ఇద్దరూ తెలుగు వారింటి ఆడపడుచులు. ఆవిషయం తెలిసిన ఏ తెలుగువాడి గుండెఅయినా ఉప్పొంగక తప్పదు. కాని ఎంతటి అభిమానం అయినా దానిని సరిగా వ్యక్తంచేయాలి కదా ? అక్కడే మళ్ళీ మన "తెలుగుతనం" అఘోరిస్తుంది.

ఈ ఇద్దరు ఉత్తమ కళాకారులుకాక మరి కొందరు ఢిల్లీకి వచ్చేశారు. రాష్ట్రపతినుండి బహుమతిని స్వీకరించారు. వీరిని దేశమంతటికీ పరిచయం చేయవలసిన బాధ్యత తెలుగువారిది కాదా? "ఇదుగో, ఈ ఉత్తమ కళాకారులు మా తెలుగువారు'' అని బ్రహ్మరథం పట్టవలసిన బాధ్యత తెలుగు వారిదికాదా?

అయినాసరే తెలుగుదేశపు ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించే సమాచార కేంద్రంవారు గాని, ఢిల్లీలోని తెలుగు వారందరికీ చెందిన సంస్థ అయిన ఢిల్లీ ఆంధ్ర సంఘంగాని ఏమీ చేయలేదు. శారద ఎవరో, సుశీల ఎవరో, ఊర్వశి ఏమిటో వారినేమీ బాధించినట్లు కనబడలేదు. ఈ కళాకారులే గనుకతమిళులయివుంటే తమిళ ప్రభుత్వ ప్రతినిధులు, ఢిల్లీలో మూల మూలలవున్న చిన్నచిన్న సంఘాలు అన్నీకలిసి బ్రహ్మాండమయిన సభ నేర్పాటుచేసి ఏ ప్రధాన మంత్రినో లాగుకునివచ్చి తమవారికి దేశంచేత జోహారులు అర్పింపచేసేవి. మనవారిని మనం గౌరవించేది ఎన్నడు? ఇత రులు గౌరవించేటట్లు చేసేది ఎన్నడు? మనం ఈపాఠాలన్నీ నేర్చు కునేది ఎన్నడు? మనలోని ఈ జడత్వం, ఈ చేతకానితనం పోయేది ఎన్నడు? హిందీవారి తర్వాత దేశంలో అత్యధిక సంఖ్యాకులుగా, తేనె సోనల సంగీత సాహిత్యాల వారసులుగా, ఎల్లా ప్రగడ సుబ్బారావులను, టంగుటూరి ప్రకాశాలనూ పింగళి వెంకయ్యలను, భాగవతుల విశ్వానాత్ లనూ, గూడూరి వెంకట చలాలనూ, శ్రీశ్రీలనూ. విశ్వనాథ సత్యనారా యణలనూ, ఉలిమిరి రామలింగ స్వాములనూ దేశానికిచ్చినవారుగా మనం గుర్తింపబడేది ఎన్నడు!

సరే, ఇతరులందరూ చేతులు ముడుచుకుని కూర్చున్నచోట, దక్షిణ భారత నటీనట సమాఖ్యవారు ముందుకు ఉరికారు. ఏజాతిలోనయినా, సమాజంలోనయినా పది మంది ఉత్సాహవంతులుంటే చాలు, పదివేల మంది చేయలేని పనులు చేయగలరని నిరూపించారు. స్వల్ప వ్యవధిలో శ్రీమతి

శారదకు, ఆమెభర్త (సినీనటుడు, నిర్మాత) శ్రీచలంకు ఒక చక్కటి సన్మానసభను ఏర్పాటుచేశారు. శ్రీ ఏ. ఏ. రామంగారధ్యక్షత వహించిన ఆ సభలో శ్రీయుతులు రెంటాల రాఘవరావు, రామమూర్తి మాట్లాడగా శ్రీ న్యాపతి రాఘవేంద్రరావు సమాఖ్య తరపున సన్మాన పత్రాన్ని చదివి శ్రీమతి శారదకు సమర్పించారు. ముచ్చటగా ముక్తసరిగావుండిన ఆ సభద్వారా శ్రీమతి శారదకు ఢిల్లీ తెలుగువారు తమ అభినందల నందజేశారు.

ఆరోజు ఉదయం "స్టేట్స్‌మన్" పత్రిక మొదటిపుటమీద శారద చిత్రాన్ని ప్రచురించింది.

శ్రీమతి శారద వేషంలోగాని. మాటలలోగాని ఎటువంటి ఆడంబర మూలేదు. సౌజన్యం మూర్తీభవించి నట్లున్న ఆ నటీమణి తనకుజరిగిన గౌరవానికి, నెమ్మదిగా ధన్యవాదాలు తెలుపుతుంటే- "నిజంగా ఈమె కళాతపస్విని" అనిపించింది. ఆ తర్వాత మాట్లాడుతూ శ్రీచలం "ఇంట గెలిచి రచ్చగెలవమన్నారు. కాని శారద విషయంలో మాత్రం మొదట రచ్చలో గెలిచాకనే ఇంట్లో గుర్తింపువచ్చింది" అన్నారు.

తెలుగు సోదరులారా అండ్ సోదరీమణులారా , ప్లీజ్ నోట్ ఇట్ !

[27 మార్చి 70]